రవీంద్రభారతిలో సంగీత కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆ రోజు వీణాదేవి కచ్చేరి. ఎప్పటిలాగే హాలు నిండిపోయింది ఆహూతులతో. అమెరికానుండి వచ్చిన జేన్ కూడా నగరంలోని ప్రముఖ మహిళా మండలి తరపున ఆ కార్యక్రమానికి హాజరయింది.




శ్రీరంజని రాగవర్ణంతో ప్రారంభమైన కచ్చేరి రెండు మూడు కీర్తనలు పూర్తయే సరికి ఊపునందుకుంది. పసుపురంగు పట్టు చీరలో నిండుగా హుందాగా ఉంది వీణాదేవి. చిరకాల సాధన తాలూకు సరళత, గమకం ఆమె గాత్రంలో వ్యక్తమవుతున్నాయి. ఎక్కడా రాపిడి లేనట్లు తీగలాగా సాగిపోతున్న గానం తన్మయత కలిగిస్తోంది అందరికీ మేలిమి బంగారు ఛాయ ముఖంలో వెలిగిపోతున్న ఏదో వింత తేజస్సు, కాటుక దిద్దిన కళ్లలో మెరుస్తున్న ఒక అవ్యక్తమైన భావం అందరి దృష్టినీ అటే ఆకర్షిస్తున్నాయి.

కొన్నాళ్లపాటు అభ్యసించి ఉండటం వలన కర్ణాటక సంగీతంలోని మెలకువలను తేలికగా గ్రహించి ఆనందించ గలదు జేన్. జలపాత ధ్వని లాంటి 'జాజ్' కన్నా నిండైన నది లాంటి కర్ణాటక బాణీలను ఎక్కువ ఇష్టపడుతుంది ఆమె.

'నరాల్లో ఉత్తేజాన్ని నింపే పాశ్చాత్య సంగీతం మనసు పై పొరలను మాత్రమే స్పృశించగలదు. మెల్లగా హృదయాన్ని తాకే భారతీయ సంగీతం మాత్రం మనసు అట్టడుగు పొరల్లోని భావాలను కూడా కదిలించి ఆనందంతో నింపివేస్తుంది. శాశ్వత ముద్ర వేస్తుంది' అని ఆమె అభిప్రాయం.

మోహన రాగాలాపన తర్వాత కీర్తన అందుకుంది వీణాదేవి. 'రామా! నిన్నే నమ్మిన వాడనూ' అనే మాటల్లోని అర్థం తెలియక పోయినా, భావం స్ఫురించినట్లే ఉంది జేన్‌కి. తేలిగ్గా జారిపోయిన మోహనకు వెనుక గంభీరంగా అడుగులు వేస్తున్నట్లు సాగిన భైరవి ఆతర్వాత రాబోయే కదన కుతూహలానికి దారివేసింది.

'ఈ బాణీల్లో కూడా ఇంత ఊపు, ఉద్వేగం ఉన్నవా?' అని ఆశ్చర్యపోయింది జేన్. 'రఘువంశ సుధాంబుధ చంద్రశ్రీ' అనే పాట వింటున్నపుడు. కనులు మూసుకుంది తన మేధను ఏ మాత్రం వృథా చేయకుండా చెవులకే వదిలి వేయ దలచుకున్నట్లుగా.

సూదిపడినా వినిపించేంత నిశ్శబ్దంలో వీణాదేవి గానం ఆ ప్రదేశాన్ని నింపివేసింది పూలపరిమళంలాగా, పిల్ల తెమ్మెరలాగా. అది ఒక తీయని ప్రవాహం. ఒక చైతన్య స్రవంతి. ఒక రాగ జలధి ... నవజీవన విపంచి. ఏవేవో లోకాల ద్వారాలు తమకోసం తెరచుకున్నట్లు, తెల్లని తెరల మీదుగా ప్రయాణం సాగిస్తున్నట్లు ప్రతి ఒక్కరూ అనుభూతి చెందారు.

ఆ స్వాప్నిక జగత్తునుండి జేన్ బయట పడేసరికి హాలంతా చప్పట్లతో మార్మోగి పోతోంది. తెలివి తెచ్చుకుని తనూ వారితో చేయి కలిపింది వెంటనే కచ్చేరి ముగిసింది.

హాలులోనుండి ఒక్కొక్కరే వెలుపలకు వస్తున్నారు.

"మిస్టర్! నేను వీణాదేవిని కలుసుకోవాలి. నన్నామెవద్దకు తీసుకుని వెళ్ళగలరా?"

హడావిడిగా ఎటో వెళుతున్న శ్రీధర్ ఆగి ఆమెవైపు చూశాడు. అతడే ఆనాటి కార్యక్రమం ఏర్పాటు చేసిన సభకు కార్యదర్శి.

'అవశ్యం' అన్నట్లుగా జేన్‌ని లోపలి వైపుకు తీసుకుని వెళ్లాడు.

లోపల హాల్లో నల్గురైదుగురు అతిధులు, ఒకరిద్దరు ఆర్కెస్ట్రా బృందం మాట్లాడుకుంటున్నారు. వీణాదేవి జాడే లేదు ఎక్కడా.

"రామూ! వీణాదేవి ఎక్కడున్నారు?"





## తృష్ణ

గుమ్మందగ్గర నిలబడ్డ కుర్రాణ్ని పిలిచి అడిగాడు.

"ఆమె ఇప్పుడే వెళ్ళిపోయారు సార్!" అన్నాడు ఆ కుర్రాడు వినయంగా.

జేన్ హతాశురాలైంది ఆ జవాబువిని. నిస్సహాయంగా ఆమెవైపుచూస్తూ, "సో సారీ మిస్! రెండునిమిషాల క్రిందటకూడా నాతో మాట్లాడారు ఆమె. బహుశ నేను బయటకు వెళ్ళి తిరిగి వచ్చేలోపల..."

'నెవర్‌మైండ్! ఆమె అడ్రస్ ఇవ్వగలరా?'

"ఓయస్." జేబులోనుండి పేపరూ, పెన్నూతీసి చకచకా ఆమె అడ్రెస్ రాసి ఇచ్చాడు.

* * *

గేటువద్దనుండీ వీధిగుమ్మం వరకూ ఎర్రని మట్టిబాట. హద్దుగీసినట్లుగా అటూ ఇటూ పేర్చిన ఇటుక రాళ్లను దాటితే చిన్న చిన్న పూ పొదరిళ్లు ... మధ్య మధ్య వ ఆకు ప చ్చ ని లయాలలో ఫ్లవర్‌బెడ్స్. ఫ్లవర్ బెడ్స్‌లో రంగురంగుల కార్నే షన్స్‌తో బాటు జినియాలు కూడా విచ్చుకుని పకపక నవ్వుతున్నట్లున్నాయి. పొదరిళ్లను అలంకరించిన బోగన్‌విల్లా, రాధా మాధవి పూలతలు గాలికి మెల్లగా తలలూగిస్తున్నాయి.

ఒక క్షణంపాటు వాటిని తదేకంగా చూసి అడుగు ముందుకు వేసింది జేన్. కాలింగ్ బెల్‌కి సమాధానంగా గాజుల గలగలలు విన్పించాయి. కొద్దిసేపటికి తెరచిన తలుపుల కవతల ప్రత్యక్షమైంది వీణాదేవి.

లేత ఎరుపురంగు జరీ చీర, వదులుగా ముడివేసిన తలలో ఒకే ఒక అరవిచ్చిన దానిమ్మమొగ్గ; చీర రంగుతో పోటీ పడుతున్న నొసటి సింధూరం, మెడలో పగడాల మాల, చేతులకు ఎర్రని గాజులు—వీణాదేవి అలంకరణలో ఏదో ప్రత్యేకత ఉందనిపించింది జేన్‌కి.

భారతీయ సంప్రదాయంలో నమస్క రిస్తూ, "నాపేరు..."అనే లోపలే, "తెలుసు, మిస్. జేన్ మిల్లర్. మిమ్మల్ని ఇదివరకే కలుసుకున్నాను ఒకసారి..." అన్నది వీణాదేవి చిరునవ్వుతో. విచ్చుకున్న ఎర్రని పెదవుల చాటునుండి తెల్లని పలువరుస తళుక్కు మంది ఆ చిరునవ్వులో. ఆమె జ్ఞాపకశక్తిని మెచ్చుకోకుండా ఉండలేక పోయింది జేన్

శాంతి నికేతన్‌లో తను సంగీతం అవ

నిన్నొన్న రోజులలో ఒకమారు వీణాదేవి అక్కడకు రావడం జరిగింది. అక్కడి విద్యార్థులను ఆమెకు పరిచయం చేశారు అధ్యాపకులు. వందపైగా ఉన్న తామందరిలో తనను ఆమె గుర్తుంచుకోగలదన్న ఆశ లేక పోయింది జేన్‌కి. కాని ఆమె గుర్తుంచుకుంది. ఆ భావన ఎనలేని ఆనందాన్నిచ్చిందా అమెరికన్ యువతికి.

''మీ జ్ఞాపక శక్తి అమోఘం! ఎలా గుర్తుంచుకోగలిగారు, నన్ను?''

''కారణం తెలియదు. కొన్ని సంఘటనలు, కొందరు వ్యక్తులు మనసులో నిల్చిపోతారు, చూడండి...''

''కరెక్ట్! అందుకే ఈ జ్ఞాపక శక్తి అనేది చాలా విచిత్రమైనదంటానునేను. దైవదత్తమైన వరాల్లో అది ఒకటి...''

వీణాదేవి ముఖంలోని చిరునవ్వు మాయమైపోయింది.

''దైవదత్తం... హుఁ...'' అనుకుంది తనలోతనే పరధ్యానంగా.

''నేను మీ అభిమానిని. మీ ప్రోగ్రాం ఒక్కటిగూడా మిస్ అవకుండా వింటుంటాను. నిన్నటి మీ కచ్చేరి ... చాలా అద్భుతం. రియల్లీ యు డిడ్ ఎ మార్వెలస్ జాబ్....''

చిన్నగా నవ్వింది వీణ.

''సాధనమున పనులు సమకూరు ధరలోన' అని మాకొక నానుడి ఉంది. ఏ విద్య అయినా అభ్యాసం వల్ల సులభమౌతుంది....''

''నిజమే కావచ్చు కాని స్వతస్సిద్ధంగా కొంత అభిరుచి, కొంత టాలెంట్ ఉండాలిగా.




## తృష్ణ

అవిలేనినాడు ఎంత సాధన ఉన్నా బూడిదలో పోసిన పన్నీరే...''

''ఆ మాట నేను ఒప్పుకోను. నిరంతర సాధన వలన మానవుడు సాధించలేనిది ఏమీ లేదు. కాని కొన్ని కొన్ని వరాలు కొంత మందికి అయాచితంగా ప్రసాదించబడుతుంటాయి. అటువంటి వారికి సాధన అవసరంలేదు. గానం అనేది కూడా అటువంటి వరాల్లో ఒక్కటని ఒప్పుకుంటారా?''

''తప్పకుండా అలాంటిదేదో ఉండబట్టే మీగానంతో ఇంతమందిని ప్రభావితం చేయగల్గుతున్నారు...''

''నామాట వదిలేయండి. నేనిందా సాధకురాలినే. మీరిందాక అన్నారే 'దైవదత్తమైన' అని. అలాంటివరం ఏదీ నాకు ప్రసాదించబడలేదు. ఏమాత్రం ప్రాక్టీసు తప్పినా నాపాటలో పటుత్వం పోతుంది.''

''ఇండియాలోని ప్రసిద్ధ గాయకుల్లో మీరొకరు. మీరిలా అనడం ఆశ్చర్యంగాఉంది.''

''నిజమే. ఎవరైనా అలాగే అనుకుంటారు. అభ్యాసం వలన కల్గిన పాండిత్యం మెరుగు పెట్టినట్లు కన్పిస్తుందే కాని సహజ పాండిత్యానికి ఉన్న స్వయం ప్రకాశం దీనికి ఉండదు. నా సంగీతం హాయిగా ఫ్యాన్ గాలి లాగా ఉంటుందనుకోండి... ఇదే సహజమైన గానప్రతిభ కలవారు పాడితే మరింత హాయిగా మలయ మారుతంలాగా ఉంటుందనవచ్చు. ఇదంతా ఎందుకు? మీరే స్వయంగా చూద్దురుగాని. ఇటురండి...''

కుర్చీలోనుండి లేచి లోపలి హాల్లోకి దారి తీసింది వీణాదేవి. జేన్ ఆమెను అనుసరించింది.

* * *

విశాలమైన హాలు అది. నీలిరంగు గోడలు, విశాలమైన కిటికీలకు ఆకాశరంగు కర్టెన్లు, నేలపైన నీలాలరంగు తివాసీ, గుమ్మానికి నీలి పూసలు గుచ్చిన తెర -- బరువైన వాతావరణాన్ని సూచిస్తున్నట్లుగా ఉంది గది అలంకరణ. ఒకవైపు రేడియోగ్రాం దానికి ఎదురువైపు టేప్‌రికార్డర్ ఉన్నాయి. రికార్డ్ ప్లేయర్ ప్రక్కనే ఉన్న పెద్ద అలమారాలో రకరకాల రికార్డులు దొంతరలుగా పేర్చి ఉన్నాయి. కిటికీ మధ్యలో ఉన్న పొడుగైన బల్లమీద గాజు ఫ్లవర్‌వాజులో నుండి ఏవో నీటిపూలు తొంగిచూస్తున్నాయి. అవికూడా నీలం రంగులోనే ఉన్నాయి.

''కూర్చోండి.''

నీలంరంగు కవర్ వేసిఉన్న సోఫాలో కూర్చుంది జేన్. ఆమె కూర్చున్న ప్రదేశం నుండి కిటికీ అవతలి దృశ్యం మనోజ్ఞంగా కనిపిస్తోంది. స్వచ్ఛమైన నీలి ఆకాశంలో ప్రయాణం చేస్తున్నాయి చిన్ని చిన్ని వెండి మబ్బులు. పచ్చలు జల్లినట్లు మెరుస్తోంది పచ్చిక సూర్యకాంతిలో. ప్రముఖ చిత్రకారుడు వేసిన చిత్రంలోలాగా. దూరంగా గంభీరంగా అక్కడక్కడా నిలబడి ఉన్నాయి పొడవైన కొబ్బరిచెట్లు.

అలమారాలో నుండి టేప్‌తీసి రికార్డర్‌లో అమర్చింది వీణాదేవి.

''మీకు ఒకరి పాట విన్పిస్తాను. శిక్షణా, అభ్యాసమూ ఎరగని గానం అది. సహజమైన సంగీతం...'' అంటూ స్విచ్ నొక్కింది.

టేప్ తిరుగుతోంది. మొదట ఏమీ శబ్దంలేదు ... తర్వాత ఏదోధ్వని ... బావిలో నీళ్లు తోడుతున్న గిలక శబ్దం ... ప్రారంభమైంది. ఆ వెంటనే నవ్వుని కూనిరాగంతో మొదలైన స్త్రీ కంఠం పాటలోకి ప్రవేశించేసరికి చెవులను అప్పగించి శ్రద్ధగా వినసాగింది జేన్.

'సుందర సుమధుర శోభా పెంపొందే
ఈ విశ్వ మధ్యమున నీవే ద్యూ
వెలుగొందే...''

ఎక్కడో కొండ చరియల్లో పుట్టి మెలికలు తిరుగుతూ అడవుల మధ్య నుండి దారి చేసుకుంటూ వెళ్ళిపోయే జీవనదిలా సాగుతోంది పాట. అప్పుడే విరిసి మంచులో తడిసిన పూవుల్లో ఉన్న తాజాదనమూ, మృదుత్వమూ కూడా ఉన్నాయి అందులో, సన్నని చిరుజల్లులు రాలుతున్నట్లు, చల్లని పిల్ల వాయువులు తాకుతున్నట్లు హాయిగా ఉంది ఆ కంఠం. తన్మయత్వంతో కనులు మూసుకుంది వీణ. వెన్నపూస కరిగిపోయినట్లు ఆ గానం కొద్దిసేపటికి బావి గిలక చప్పుడులో కలిసిపోయింది. తేనెవాక లాంటి ఆ గానం జేన్‌ని ముగ్ధురాలిని చేసింది.

''మీరు చెప్పింది హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్. కోపం తెచ్చుకోనంటే మీ సంగీతం కన్నా ఫ్రెష్‌గా ఉందంటాను.'' అంది పాట పూర్తవ్వగానే.

చిరునవ్వు నవ్వింది వీణ.

''గురువులు మెచ్చుకుంటే కోపగించుకునే శిష్యులుంటారా ఎక్కడైనా?''

"ఈమె పేరు ?"

"నీలిమ" ఎటో చూస్తూ చెప్పింది.

"నీలిమ! చాలా అందమైన పేరు. ఏంచేస్తున్నారిపుడు ?"

"ఏమీ చెయటంలేదు, జేన్! ... ఆమె ఇప్పుడు జీవించిలేదు."

షాక్ తగిలినట్లుచూసింది జేన్.

"ఈమె ... ఈమె ... జీవించిలేదూ ?"

బాధ, ఆశ్చర్యం మిళితమై ఉన్నాయి ఆ గొంతులో. అంత మధురమైన కంఠం నుండి మరోపాట వినే అవకాశం లేదన్న ఆలోచన ఆమె హృదయాన్ని మెలిపెట్టింది.

నిర్వికారంగా ఎటో చూస్తూంది వీణ.

"ప్చ్ ... భగవంతుడు ఎందుకిలా చేస్తాడో..." బరువుగా నిట్టూర్చింది జేన్.

## తృష్ణ

"అంత కమ్మని గొంతునిచ్చి ఆయుష్యు నివ్వలేదు."

"భగవంతుడేమీ చేయలేదు జేన్!" మధ్యలోనే అడ్డుకుంది వీణ. కొద్ది సేపాగి మెల్లగా అంది. "మనుషులే... విలువ తెలియని మనుషులే... భగవంతుడిచ్చిన కానుకను నేల రాసేశారు. మట్టిపాలు చేసుకున్నారు..."

'మీరనేది ఏమిటో నాకర్థం కావటంలేదు'

"శుష్కమైన సాంప్రదాయాలనూ, జీవంలేని ఆచారాలనూ పట్టుకుని ప్రాకులాడే వారే...ఆమెలోని కళను గుర్తించలేక వృధా చేసుకున్నారు..."

"అంటే... ఎలా జరిగింది ఇది ? నాకు చెప్పాలి మీరు, ప్లీజ్!... ఈపాటవిని ఈమె గురించి ఏమీ తెలుసుకోకుండా వెళ్లిపోతే శాంతి ఉండదు నాకు. చెప్పండి, వీణా! ఈమె మీకెలా తెలుసు?"

"ఏం చెప్పను, జేన్! నీలిమది మాపూరే" అంటూ ప్రారంభించింది వీణ.

* * *

భారత దేశంలోని వేలాది పూళ్లలో అది కూడా ఒకటి. సారం హరించిపోయినా, పిప్పిలాంటి ఆచారాలను వదలలేని ఛాందసులు, భ్రాంతిలో, మిధ్యా గౌరవంలో జీవించే మధ్య తరగతివారు ఎక్కువగా ఉన్న వూరు. పంకంలో పద్మంలాగా పుట్టింది నీలిమ ఆ వూళ్లో.

కుటుంబంలో ఒక పరిమళ పిచిక పిచింట నీలిమ పుట్టటంతో, ఆమె గొంతులో తీయదనం అందర్నీ ఆ కట్టుకునేది. పాడగల్గటం ఆమెకు భగవంతుడు ప్రసాదించిన వరం.

'శిశుర్వేత్తి పశుర్వేత్తి... వేత్తిగానరసః ఫణిః'అన్నారు. పాములనూ, పాపలనూ గూడా ఒక్కటిగా ఆనందింపచేయగల గానం నిజంగా దైవదత్తంగా రావలసినదే. భాష తెలియక పోయినా భావాన్ని అందించి స్నేహం పెంచగల శక్తి రాగానికే ఉందిమరి.

అటువంటి రాగంలో ఉన్న మాధుర్యమంతా సప్తాక్షరాలలో, సప్తస్వరాలలో కుదించారు శాస్త్రజ్ఞులు. ఈ ఏడు స్వరాలనే వివిధ స్థాయిలలో వివిధ కలయికలతో కూర్చటం ద్వారా డెబ్బయి రెండు మేళకర్త రాగాలు ఏర్పడ్డాయి. వాటినుండి పుట్టినవే మిగిలిన రాగాలు. జన్యరాగాలు. ఇవన్నీ సంగీత సామ్రాజ్యాన్ని మోసే స్తంభాలు. ఆ భవనానికి దారిచూపే మణిమయ దీపాలు.

అయితే ఆ దీపాల కాంతి అవసరం లేకుండానే, వాటిని గూర్చిన పరిజ్ఞానం లేకుండానే సంగీతాన్ని కరతలామలకం చేసుకోగల్గింది నీలిమ. అందుకే ఆమెది సహజ పాండిత్యం అన్పించుకుంది.

సృష్టి చిత్రం ఏమిటో ఏదీ సాఫీగా సాగిపోదు. ఒకటిచ్చి మరొకటి లేకపోవటం దేవుడికి సరదా ఏమో! పాడాలనే తపనా, పాడగల్గిన గాత్రమూ ఇచ్చి, పాడే అవకాశం కరవు చేశాడు నీలిమకు.

ఆచారాన్ని తప్పని తలిదండ్రులు పన్నెండవ ఏటనే పెళ్ళిచేసి నీలిమను అత్తవారింటికి పంపారు. ఆమెజీవితంలో పరమార్థం అప్పుడే ప్రారంభమైంది.

(46వ పేజీ చూడండి)


# ఉచితం!




అంతా-క్రొత్త
ఫోర్‌హేన్స్ చిన్న పుస్తకం 'దంతములు, ఇగుళ్ళను గురించి తీసుకోవలసిన శ్రద్ధ'

ఈ వివరణాత్మకమైన రంగుల చిన్న పుస్తకమును ఉచితంగా పొందండి!
ఈ కూపన్ ఇప్పుడే పోస్టు చెయ్యండి.

మేనర్స్ డెంటల్ అడ్వయిజరీ బ్యూరో, పోస్టు బ్యాగ్ నం.10031, బొంబాయి-1.
దయచేసి ఫోర్‌హేన్స్ వారి* "దంతములు, ఇగుళ్ళను గురించి తీసుకోవలసిన శ్రద్ధ" యొక్క ఉచిత ప్రతి ఒకటి నాకు పంపండి. తపాలా ఖర్చులకై 25 పైసల తపాలా బిళ్ళలను జతచేసి పంపుచున్నాను. AP-IBA

పేరు ________ వయస్సు ________

చిరునామా ________

*కావలసిన భాష క్రింద గీతగీయండి: ఇంగ్లీషు, హిందీ, మరాఠీ, గుజరాతీ, ఉరుదు, బెంగాలీ, అస్సామీస్, తమిళం, తెలుగు, మలయాళం లేక కన్నడ.

ఫోర్‌హేన్స్ దంతవైద్యునిచే సృష్టింపబడిన టూత్ పేస్ట్

100F-152 TEL R

# తృష్ణ

(42వ పేజీ తరువాయి)

సంగీతాభిరుచిలేని, కరుకుదనం మూర్తీభవించిన భర్త, అతగాణ్ణి ఆ విధంగా తీర్చి దిద్దిన తలిదండ్రులూ, నీలిమలోని ప్రతిభను గుర్తించలేదు సరికదా పాడడం ఒక నేరం క్రింద జమకట్టారు.

మృదు హృదయం నీలిమది. చిగురుటాకు సవ్వడి, పిల్ల తెమ్మెర తాకిడి కూడా ఆమె మనసును స్పందింప జేసేవి. ఒక ఊపులో, ఉత్తేజంలో సర్వాన్ని మర్చిపోయి పాడుకుంటూ ఉండేది. అది సహించలేని అత్తమామలు ఆంక్షపెట్టారు పాడరాదని. పాపం! ఆమె ఏం చేయగలదు? తలిదండ్రుల ఆసరా కూడా ఏమీ లేదు. నలుగురు నడచిన బాటను వదలి ఇవతలకు రావాలంటేనే భయపడే పిరికివారు. కూతురికి ఏం సాయం చేయగలరు?

'ఆడదాని జీవితం కన్నీటి మయమేననీ, సర్దుకోవటమే అమె విధి' అనీ భావించారు వారు.

గుండెల్లో చెలరేగే దుమారాన్ని అణచలేకా, గొంతువిప్పి పాడనూలేక సతమతమైపోయేది నీలిమ. అణగదొక్కిన కోరిక, తీరని నిస్పృహ ఆమె ఆయుర్దాయాన్ని కబళించివేశాయి. ఎక్కువరోజులు ఈ ఘర్షణలో, రాపిడిలో నలగవలసిన అవసరం లేకుండానే శాశ్వతంగా ఆమె కంఠం మూతపడిపోయింది. అప్పటికే ఆమె ప్రాణాలు పంచభూతాలలో కలిసిపోయాయి.

ఎలా ప్రసాదించాడో అలాగే తన దగ్గరకు తీసుకున్నాడు భగవంతుడా పుష్పాన్ని. కాని ఆ పూవు తాలూకు సువాసనలు మాత్రం మిగిలిపోయాయి కొన్ని.

* * *

జేన్ కనుకొలుకుల్లో నీటిబొట్లు నిలిచాయి.

'ఎంత దుర్భదష్టం! చేరువలో ఉన్న విలువను గుర్తించలేకపోవటం నిజంగాదౌర్భాగ్యం. ఇంతకీ ఈ పాట ఎప్పుడు రికార్డ్ చేశారు?'' కర్చీఫ్‌లో కనులు అద్దుకుంటూప్రశ్నించింది.

''ఒకనాడు తోటలో నీలిమ నీళ్లు తోడుతూ పాడుకుంటున్నప్పుడు... ఆమెకూ, ఆ యింటిలోని వారికీ తెలియకుండా...రికార్డు చేశాను.''

''అమె మీకు గురువు అన్నారు కదూ! నీలిమ జ్ఞాపకార్థమే ఈ గదిని నీలి రంగుతో అలంకరించినట్లున్నారు. ఆమె ఏ విధంగా పరిచయమయారు, మీకు?''

''మాది మానసికబంధం ... జన్మాంతర బంధం...'' అని నవ్వింది వీణ.

''అన్నట్లు మీకో సంగతి చెప్పటం మర్చిపోయాను. నీలిమకు ఒక చెల్లెలు ఉంది. ఆమెకూడా కొద్దిగా పాడగలదు. అక్క జీవితం అంతమైన తీరు, ఆమె కొకపాఠం నేర్పింది.

తనలోని అభిరుచిని వృథాకానీయగూడదని ఆనాడే ప్రతిన బూనింది తలిదండ్రులనూ, సంఘపు కట్టుబాట్లనూ ఎదిరించి తన అభీష్టాన్ని నెరవేర్చుకుంది

''ఆమె పేరు వీణాదేవి''

అంకితం

మధుర గాయకులు, కళాతపస్వి, కీర్తిశేషులు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుగారి స్మృతికి.

—'ఉత్తర'


అనతికాలంలోనే అశేష ఆంధ్రుల అభిమానాన్ని చూరగొన్న

కమనీయ కథల మాస పత్రిక ★ వెల : రూపాయి పావలా

స్వాతంత్ర్య దినోత్సవ సంచికగా (ఆగస్టు–74) ఆఫ్‌సెట్ ముఖ చిత్రంతో, కొంగ్రొత్త పోకడలతో మా అభిమాన సంపాదకులు, రచయిత శ్రీ వ్యాస్‌చంద్ సంపూర్ణ బాధ్యతతో జూలై నెలాఖరుకు ముదలవుతుంది. ఏజంట్లకు 25% కమీషన్ యివ్వబడును.

కాపీ ఒక్కంటికి రూ. 2/– డిపాజిట్ చెల్లించవలయును.

సంవత్సరచందా రూ. 15/—

వివరాలకు : మేనేజర్, కల్పన సచిత్ర కథల మాస పత్రిక, 33, మూసాసేట్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు—600017.

ఝండూవారి అసాధారణ

ఫ్లూ, రొంప మరియు మలేరియా జ్వరం నుండి సురక్షక మరియు శీఘ్ర నివారణ నిమిత్తం

త్రిశూన్ బిళ్లలు

కడుపుబ్బరించే అజీర్ణ బాధలనుండి శక్తివంతమైన శీఘ్ర నివారణ నిమిత్తం

అభయాసన్ బిళ్లలు

ఝండూ ఫార్మసుటికల్ వర్క్సు లి,
బొంబాయి 400 025
ఎల్ల చోట్లా లభించుచున్నవి

3 BROTHERS/TEL

స్టాకిస్టులు : మెస్సర్స్: దా మో ద ర్ & కో.,
113, నైనప్ప నాయకన్‌వీధి, మద్రాసు-1.


**Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3 Editor S Radhakrishna**